క్లుప్తంగా

ఉపాధి వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్

కె.కోటపాడు : వేసవి సమయంలో ఉపాధి వేతనదారులు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. పాడుగుపాలెంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఓఆర్ఎస్‌ను నీటిలో కలుపుకొని తాగాలని ఆయన సూచించారు. చల్లని కాటన్ వస్త్రాన్ని తలపై వేసుకుని ఉపాధి వేతనదారులు పనుల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీ నాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈశ్వరమ్మ

కె.కోటపాడు: సామాజిక బాధ్యతగా గ్రామాల కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, ఆర్.ఐ జానకి పాల్గొన్నారు.

మూగజీవాల కోసం చలివేంద్రం



మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన నీటి పాత్రలు

కె.కోటపాడు : మండలంలోని కూండ్రపువానిపాలెంలో మూగజీవాల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వాటికి నీటిని అందించేందుకు ప్రత్యేక నీటి పాత్రలను గ్రామానికి చెందిన కుభిరెడ్డి రాధాకృష్ణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరావాలమ్మ తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు కన్నూరి సూర్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ కోరెడ్డి అప్పలనాయుడు, సూర్యప్రభ, సన్యాసినాయుడు, కుభిరెడ్డి భవాని తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



జెడ్.జోగింపేటలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రమణారావు

రావికమతం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి, ఓటు వేసే ముందు ఎటువంటి ప్రలోభాలకు గురికారాదని గిరిజన గ్రామం జెడ్.జోగింపేటలో ప్రజలకు తహసీల్దార్ రమణారావు,ఎంపీడీవో భానోజీరావు, ఏపీఎం తిలక్ తెలిపారు. ఆ గ్రామస్తులకు ఓటు హక్కుపై బుధవారం అవగాహన కల్పించారు. స్వీప్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. చీమలపాడు పంచాయతీలోని గిరిజన గ్రామాల్లో గిరిజనులు చీమలపాడులోని పోలింగ్ కేంద్రానికి నడిచి రానవసరం లేదని, పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసి, తిరిగి వెళ్లేందుకురవాణా సౌకర్యం కల్పిస్తామని తహసీల్దార్ రమణారావు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు

చోడవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారామిలటరీ దళాలు, పోలీసు సిబ్బందితో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అడ్డూరు, దుడ్డుపాలెం, బుచ్చెయ్యపేట, నర్సాపురం, రాయపురాజుపేట, సీమునాపల్లి, భోగాపురం గ్రామాల్లో కవాతు నిర్వహించినట్టు చెప్పారు. ఎస్ఐ డి.శేఖరం తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో.. ఆకలిమంటతో పింఛన్ల కోసం పడిగాపులు

- సచివాలయాల వద్ద గంటల కొద్దీ నిరీక్షించిన వృద్ధులు, దివ్యాంగులు
- పలు ప్రాంతాల్లో పంపిణీ కాని నగదు
- టీడీపీ వల్లే మాకీ అవస్థలంటూ పలువురు మండిపాటు



ఏఎల్‌పురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



చుక్కపల్లి సచివాలయంలో పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు

దేవరాపల్లి: కడుపులో చల్లకదలకుండా ఇంటి వద్దే పింఛన్లు తీసుకునే వృద్ధులు, దివ్యాంగులు ఈ సారి పింఛన్ పొందేందుకు నానా అవస్థలు పడవలసి వచ్చింది. బుధవారం పింఛన్లు ఇస్తారని తెలుసుకుని నడవ లేని స్థితిలో ఉన్న అవ్వాతాతలు, వికలాంగులు సచివాలయాల వద్దకు ఉదయాన్నే అతి కష్టం మీద చేరుకున్నారు. పలు ప్రాంతాల్లో సాంకేతిక లోపాల కారణంగా బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేయడం ఆలస్యమైంది. దీంతో వృద్ధులంతా ఆకలితో మంటుటెండలో గంటకొద్దీ నిరీక్షిస్తూ నరకయాతన పడ్డారు. మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేసిన అధికార్లు సాయంత్రం వరకు కొందిరికే ఇచ్చి మిగిలిన వారంతా రేపు రావాలని చెప్పడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు. తమను ఇబ్బందులకు గురిచేసిన టీడీపీ నాయకులతో పాటు వారికి వంతపాడిన ప్రతి ఒక్కరికీ కచ్చితంగా తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.



చోడవరం సచివాలయం -3 వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

మాడుగుల: మండలంలో 11,998 మంది పింఛనుదారులకు రూ.3,61,14000 కోట్లు అందజేయవలసి ఉంది. బ్యాంకులో సాంకేతికపరమైన లోపాల వల్ల నగదు సకాలంలో విత్ డ్రా కాలేదు. దీంతో పింఛన్లు పంపిణీ కాలేదు. సాయంత్రం వరకు వేచి ఉన్న వృద్ధులు ఉసూరు మంటూ ఇళ్లకు వెళ్లారు.

చీడికాడ: మండలంలోని కోనాం, అర్జునగిరి, వి.బి.పేట, చీడికాడ, ఎల్.బి.పట్నం, తురువోలు,తునివలస, డి.సురవరం, మంచాల పంచాయతీల్లోని పలువురు రోగులకు ఆయా సచివాలయాల సిబ్బంది సాయంత్రం పింఛన్లు అందజేశారు. మరికొన్ని ప్రాంతాల్లో పింఛన్ల కోసం చాలా మంది ఉదయాన్నే సచివాలయాలకు వెళ్లారు. మధ్యాహ్నం పంపిణీ చేస్తామని సచివాలయ సిబ్బంది చెప్పడంతో పలువురు పింఛన్లు తీసుకోకుండానే ఇళ్లకు వెళ్లిపోయారు.

నర్సీపట్నం: నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ బుధవారం అంతంత మాత్రంగా జరిగింది. నర్సీపట్నం మండలంలో 5,351, నర్సీపట్నం మున్సిపాలిటీలో 7129, నాతవరం మండలంలో 11,250, గొలుగొండ మండలంలో 8,792, మాకవరపాలెం మండలంలో 11,284 మంది లబ్ధిదారులు ప్రతి నెలా పింఛన్ పొందుతున్నారు. వీరిలో చాలా మంది కుటుంబ సభ్యుల సాయంతో బుధవారం సచివాలయాలకు చేరుకున్నారు. సకాలంలో బ్యాంక్ నుంచి నగదు రాకపోవడంతో పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ జరగలేదు.



రోలుగుంటలో లబ్ధిదారులకు పింఛన్ ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి రవికిరణ్, సిబ్బంది

గొలుగొండ: మండలంలోని పలు సచివాలయాల్లో మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఏఎల్ పురంలో సచివాలయ సిబ్బంది పింఛనుదారులకు నగదు అందజేశారు. మధ్యాహ్నం వరకు వృద్ధులు ఎండలో అవస్థలకు గురయ్యారు.

మాకవరపాలెం: మండలంలోని 15 సచివాలయాల్లో బుధవారం పింఛన్ల పంపిణీని చేశారు. ఎంపీడీవో చంద్రరావు మాకవరపాలెం, కొండలఅగ్రహారం తదితర సచివాలయాలలో పంపిణీని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంచాలకే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే పింఛన్ల నగదు అందజేయాలని సచివాయల సిబ్బందిని ఆదేశించారు.

చోడవరం: మండలంలోని 28 సచివాలయాల పరిధిలో 32 పంచాయతీల్లో 13,780 పింఛన్‌దారులున్నారు. వీరికి బుధవారం సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. అన్ని సచివాలయాలకు ఒకే సారి పింఛన్‌దారులు రావడంతో గందరగోళపరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ఏదో ఒక గుర్తింపుకార్డు తెస్తేనే కాని పింఛన్ ఇవ్వడానికి వీలుకాలేదని నిబంధనలు పెట్టారు. ఇప్పటి వరకూ కేవలం వేలిముద్రతోనే ఇచ్చే పింఛన్ ఇప్పుడు అన్ని కాగితాలు తనిఖీ చేసిన తర్వాతే ఇస్తుండడంతో పింఛన్‌దారులు చాలా సేపు నిరీక్షించవలసిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితితో సచివాలయాలన్నీ పింఛన్‌దారులతో నిండిపోయాయి. లైన్‌లో నిలబడి పింఛన్‌తీసుకునేందుకు పింఛన్‌దారులు చాలా ఇబ్బందులు పడ్డారు. వలంటీర్లతోనే పింఛన్ ఇప్పించాలని వారంతా కోరుతున్నారు.



వడ్డాదిలో పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న పెన్షనర్లు

బుచ్చెయ్యపేట: మండలంలో పింఛన్ నగదు కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు వృద్ధులు,దివ్యాంగులను కుటుంబ సభ్యులు ద్వి చక్ర వాహనాలు,ఆటోలపై సచివాలయాలకు తీసుకువచ్చారు. బుధవారం ఉదయం ఉదయం 7 గంటలకే సచివాలయాలకు వచ్చి వేచి ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టారు. 35 పంచాయతీల్లో 10,805 మంది పింఛన్‌దారులు ఉన్నారు.

రావికమతం: పింఛన్ నగదు కోసం బుధవారం సచివాలయాల వద్ద వృద్ధులు పడిగాపులు కాశారు. కొత్తకోటలో సాయంత్రం ఐదు గంటల తరువాత పింఛన్ల పంపిణీ ప్రారంభించి, ఏడు గంటల వరకు ఇచ్చారు. దీంతో చాలా మంది వృద్ధులు ఉసూరు మంటూ వెనుదిరిగారు. గతంలో వలంటీర్లు తెల్లవారకముందే ఇంటికి తెచ్చి ఇచ్చేవారని, ఇప్పుడు ఎండలో పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని పలువురు వాపోయారు.

రోలుగుంట: మండలంలోని 16 సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. రోలుగుంటలో 831 మందికి గాను తొలిరోజు 500 మందికి పైగా పింఛన్లు పంపిణీ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి రవి కిరణ్ తెలిపారు. మంచంపై నుంచి లేవలేని వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఆయన చెప్పారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సిబ్బంది రాము, గోపి, లక్ష్మీదేవి, కె.ఎస్. నానాజీ తెలిపారు.



కలిగొట్ల పంచాయతీ కార్యాలయం వద్ద మండుటెండలో నిరీక్షిస్తున్న వృద్ధులు





బుచ్చెయ్యపేట, వడ్డాదిలో వృద్ధుల పాట్లు



కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

మాలాంటి ముసలోళ్లపై కోపమెందుకు ..



మా వంటి ముసలివారిపై చంద్రబాబునాయుడుకు కోపమెందుకు. ప్రతి నెలా ఒకటో తారీఖ వేకువజామునే వలంటీరు తలుపుతట్టి పింఛను అందించే వారు. ఈ ఐదేళ్ల కాలంలో గడప దాటకుండానే జగన్‌బాబు దయతో పింఛన్ సొమ్ము పొందాను. టీడీపీ నాయకులు వలంటీర్లను అడ్డుకుని పింఛన్ ఇవ్వకుండా చేయడంతో సచివాలయానికి రావాల్సి వచ్చింది. ఇక్కడ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. బ్యాంక్ నుంచి డబ్బులు రాలేదు, రేపు రమ్మని సిబ్బంది చెబుతున్నారు. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి మళ్లీ రేపు ఎలా వచ్చేది.

–నల్ల త్రిమూర్తులు,నర్సీపట్నం మున్సిపాలిటీ, శారదనగర్

వ్యయప్రయాసలకు గురయ్యాను



నేను దివ్యాంగ పింఛను పొందుతున్నాను. ఉపాధి కోసం ఓ టైర్ల కంపెనీలో పనిచేస్తూ దువ్వాడలో అద్దె ఇంట్లో ఉంటున్నాను. వలంటీర్లు సేవలు నిలిచిపోవడంతో నేను పని చేస్తున్న కంపెనీలో సెలవు పెట్టి పింఛను కోసం దువ్వాడ నుంచి కె.జె.పురం వచ్చాను. తీవ్ర వ్యయప్రయాసలకు గురయ్యాను.

– మళ్ల జగదీష్ కన్నారావు, కేజే పురం

పాత రోజులు గుర్తుకొస్తున్నాయి



చంద్రబాబు హయాంలో పింఛన్ కోసం పడ్డ కష్టాలు గుర్తుకొస్తున్నాయి. 2,3 రోజులు పింఛన్ కోసం కాళ్లు అరిగేలా పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. పడిగాపులు కాసిన చీకటి రోజులు మళ్లీ ఇప్పుడు దాపురించాయి. ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా ఇంటి వద్దకు తెచ్చి పింఛన్లు ఇచ్చే వలంటీర్లను సేవలను మరిచిపోలేం. రాజకీయ స్వలాభం కోసం చంద్రబాబు వృద్ధులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. ఈసారి కూడా జగన్‌బాబు సీఎం అయితేనే మా కష్టాలు తీరుతాయి.

–మునగపాక చిన్నోడు,నాతవరం

ఎండలలో పడిగాపులు కాశాను



నేను రిక్షాతొక్కుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడిని. వయసు మీదపడంతో రిక్షా మానేశాను. ప్రభుత్వం ప్రతి నెల అందించే పింఛనుతో జీవిస్తున్నాను. ఇప్పటివరకు వలంటీర్ ఇంటికే వచ్చి నాకు పింఛను డబ్బు ఇచ్చేవాడు. ఈ నెల నుంచి పంచాయతీ కాడ డబ్బులు ఇస్తారని చెప్పడంతో మా పంచాయతీ కార్యాలయానికి వచ్చాను. ఎండన పడి ఇక్కడికి వచ్చాను. పింఛను డబ్బుల కోసం గంటల తరబడి ఇక్కడే ఉన్నాను. మూడు నెలలు ఇలాగే డబ్బులు ఇవ్వడం అని చెపుతున్నారు. నాలాంటి ముసలోల్లు సాలా ఇబ్బంది పడాలి.

–మంజేటి నూకరాజు, కొండల అగ్రహారం, మాకవరపాలెం మండలం

నాలాంటోళ్లను ఇబ్బంది పెడుతున్నారు



పింఛన్ ఇస్తారంటే 8 గంటలకే సచివాలయానికి ఆటో కట్టించుకుని వచ్చాను. మోకాళ్ల నొప్పులు వల్ల నడవలేను. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో ఉండాల్సి వచ్చింది. వలంటీర్లను తొలగించి మాలాంటోళ్లను ఇబ్బందులు పెడుతున్నారు. ఐదేళ్లు ఇలాంటి ఇబ్బందులు లేవు,మళ్లీ పాత ఇబ్బందులు వచ్చాయి.

– రేవాడ దేవుడమ్మ,వడ్డాది గ్రామం,బుచ్చెయ్యపేట మండలం

ఎక్కువసేపు నిలబడలేను

తెల్లారే సరికి వలంటీర్లు మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడేమో సచివాలయానికి రమ్మని చెప్పారు. మధ్యాహ్నం వచ్చాను. చీకటి పడిపోయినా పింఛన్ ఇవ్వలేదు. నేను 70 ఏళ్ల వృద్ధుడిని, ఎక్కువ సేపు నిలుచోలేను. చీకటి పడితే కళ్లు సరిగా కనిపించవు. నాలాంటోళ్లు చాలా మందే ఉన్నారు. ఇంతకు మునుపులాగే వలంటీర్లతో ఇంటి వద్దే పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– అప్పలకొండ, చోడవరం

జగనన్న సంక్షేమ పథకాలే ప్రచార అస్త్రాలు

- మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

మాడుగుల : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసి సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలని, అవే తమను గెలిపిస్తాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. మండలంలోని ముకుందపురం రామాలయంలో మంగళవారం పూజలు జరిపి, అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి మాడుగుల కోటపై మూడో సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ముకుందపురం, వీరవిల్లి అగ్రహారం, పోతనపూడి అగ్రహారం, గొట్టివాడ అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు, ఎం.కృష్ణాపురం, గాదిరాయి, వొమ్మలి, జాలంపల్లి, ఎల్.పోన్నవోలు, అవురువాడ, కె.వల్లాపురం, కింతలి, పొంగలిపాక, వి.జేపురం, జేడీపేట గ్రామాల్లో పర్యటించి, కార్యకర్తల సమావేశాల్లో మాట్లాడారు. ఇప్పటి వరకు మాడుగులలో ఇద్దరు మహిళలు శాసన సభ్యులుగా పోటీచేసి విజయం సాధించారని, 50 ఏళ్ల తరువాత మళ్లీ మహిళా అభ్యర్థిగా తనకు అవకాశం లభించిందని చెప్పారు. చంద్రబాబు నీచ రాజకీయం చేసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని చెప్పారు. దీంతో అవ్వాతాతలు అవస్థలకు గురికావలసి పరిస్థితులు దాపురించాయన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా దోచుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని చెప్పారు. అనంతరం ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్ మండల పార్టీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు తదితరులు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు అన్ని గ్రామాల్లో మహిళలు అనురాధకు హారతులుపట్టి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాడుగుల పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు దండి నాగరత్నం, ఆర్లి మాధవి, సర్పంచ్‌లు కర్రి గణేష్, నందారపు మంగమ్మ, కొసిరెడ్డి కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు కోరుకొండ చెల్లంనాయుడు, విస్సారపు రామారావు,బొద్దపు భాస్కరరావు, గొల్లవిల్లి రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణ రావు, వెలగాడ ఈశ్వరరావు, కాళింగ కల్యాణ రాజు, పర్రే రామునాయుడు, పర్రే వెంకట రమణ, , బొద్దపు దేవునాయుడు, గూడెపు హరికృష్ణ, తాళ్ళపురెడ్డి రాంబాబు, జామిచిన్న, కొసిరెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అనురాధను సన్మానిస్తున్న పోతనపూడి మహిళలు



ముకుందపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాడుగుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

6వ తేదీలోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి



పింఛన్ల పంపిణీపై అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షించేందుకు సచివాలయాల వారీగా ప్రత్యేకంగా అధికారులను నియమించినట్టు ఎంపీడీవో జాగరపు రాంబాబు, తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యాప్తంగా పర్యవేక్షణకు నియమితులైన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 11,230 మందికి వివిధ రకాలు పింఛన్ల కింద రూ.3,30,35,000 నగదు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ సాయంత్రంలోపు పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛన్లు పంపిణీ చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి పంచాయతీ విస్తరణాధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వంద మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం



మనోవైకల్య విద్యార్థులకు హాట్‌బాక్స్‌ల పంపిణీ

చోడవరం రూరల్: పిల్లల్లో మనోవైకల్యం(ఆటిజం) సంభవించడానికి జన్యుపరమైన కారణాలతో పాటు క్షీణిస్తున్న పర్యావరణమూ కారణమేనని ఎంఈవో ఎం.జయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆటిజం డే సందర్భంగా బుధవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మనోవైకల్యంగల దివ్యాంగులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ ప్రస్తుతం జన్మిస్తున్న ప్రతి వందమంది పిల్లల్లో ఒకరికి ఆటిజం వచ్చే అవకాశం ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆటిజం లోపం కలిగిన పిల్లలకు తల్లిదండ్రులు అండగా ఉండాలన్నారు. జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ శకుంతల, సహిత విద్య కేంద్రాల ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథనాయుడు, సత్యనారాయణ, రమేష్, పరదేశి, శ్రీదేవి, సరస్వతి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

బుచ్చెయ్యపేట: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని ఎమ్మెల్యేగా, బూడి ముత్యాలనాయుడును ఎంపీగా గెలిపించాలని కోరుతూ దిబ్బిడిలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసిందని చెప్పారు. 14 ఏళ్లు పాలించిన టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అందరినీ మోసం చేశారన్నారు. ఇప్పుడు మీ ఇళ్లకు వస్తున్న టీడీపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. వైస్ ఎంపీపీ గొంపా చినబాబు,సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం,మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, నాయకులు జెర్రిపోతుల రామారావు,సియాద్రి తాతబాబు,భూషణం తదితర్లు పాల్గొన్నారు.



దిబ్బిడిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

6 నుంచి వార్షిక పరీక్షలు

రోలుగుంట: మండలంలోని ఎంపీపీ,యూపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఈ నెల 6 నుంచి 19 తేదీ వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంఈవో జాను ప్రసాద్ తెలిపారు. ఈ నెల 23 వ తేదీ పాఠశాలల ఆఖరి వర్కింగ్‌డే అని, తరువాత నుంచి వేసవిసెలవు ఉంటాయని చెప్పారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలు రాయాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు క్యాంప్ కోఆర్డినేటర్ సీహెచ్. అశ్విన్‌కుమార్ తెలిపారు. కుమ్మరివీధిలోని ఉషోదయ స్కూల్‌లో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి



వల్సంపేట సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఎన్నికలు ముగిసే వరకు సచివాలయం సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండలంలో వల్సంపేట సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బందికి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో మండల పరిషత్ జనరల్ నిధులు నుంచి రూ.20లక్షలతో బోర్లు వేసినట్టు తెలిపారు. మాధవనగరంలో అదనంగా పైపులైను ఏర్పాటు చేస్తున్నామని, సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సమస్యలను మాదృష్టికి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో వీఆర్వో బాబ్జి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



సీతారాముల విగ్రహాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని పొట్టిదొరపాలెంలో విఘ్నేశ్వర,మణికంఠ సమేత కోదండ సీతారామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సీతారామ కల్యాణాన్ని వేడుకగా జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన,రాత్రి భజనలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షల విలువ చేసే స్థలాన్ని విరాళంగా అందించిన దాత కొల్లిమల్ల అప్పలనాయుడు,అప్పారావు కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.